క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు చకచకా



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వేగంగా సాగుతున్న రహదారి విస్తరణ పనులు

అగనంపూడి: అమృత భారత్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు చకచకా సాగుతున్నాయి. వీటిలో భాగంగా రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్ ఫారం వైపు రహదారి విస్తరణ, ప్రొటెక్షన్‌వాల్ నిర్మాణం, ఆటో, బస్టాండ్‌ల నిర్మాణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. బీటీరోడ్డు నిర్మాణం రెండు రోజుల నుంచి వేయడంతో వేలాది మంది ప్రయాణికులు, గాజువాక, సబ్బవరం మండలాల శివారు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గాజువాక డీటీకి ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు

గాజువాక: గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి వీఎంఆర్‌డీఏ భూసేకరణ విభాగం స్పెషల్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న బి.శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్లుగా పని చేస్తున్న కొంతమందికి తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించాల్సి ఉంది. ఈ ఉత్తర్వుల నేపథ్యంలో వారికి లైన్ క్లియర్ చేస్తారనే చర్చ సాగుతోంది.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కాంట్రాక్ట్ కార్మికులతో ఎంప్లాయిమెంట్ సీనియార్టీ రా పని చేస్తున్న నిర్వాసిత కార్మికులను కూడా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తొలగిస్తోందని వివరించారు. స్పందించిన ఎంపీ స్టీల్‌ప్లాంట్ సీఎండీతో పాటు డీపీతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పితాన భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, డీఎస్‌వీ నర్సింగరావు, బలిరెడ్డి సోమినాయుడు, గణేష్ పాల్గొన్నారు.

మంత్రి రాజశేఖర్‌కు సత్కారం



మంత్రి రాజశేఖర్‌ను సత్కరిస్తున్న శిష్టకరణ సంఘ పెద్దలు

గాజువాక: ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్‌తో పాటు సింహగిరి ఆస్పత్రి ఎండీ డాక్టర్ కె.వి.ఎస్.కల్యాణ్‌ను గాజువాక శిష్టకరణ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. మంగళవారం నిర్వహించిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో వారిని సత్కరించి అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్.వెంకట రమణమూర్తి (ఉమా), ప్రధాన కార్యదర్శిగా డి.హరికుమార్, కోశాధికారిగా జి.జయలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ ప్రముఖులు ఎస్.వెంకటేశ్వరరావు పట్నాయక్, కె.గౌరీ ప్రసాదరావు, పొట్నూరు ఫణీంద్ర, పి.వి.టి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల రాయితీలు హోటల్ రంగానికీ అందించాలి

మంత్రి టీజీ భరత్‌కు వివిధ సంస్థల ప్రతినిధుల వినతి

ఏయూక్యాంపస్: ప్రభుత్వ పరంగా పరిశ్రమలకు కల్పించే రాయితీలను హోటల్ రంగానికి సైతం కల్పించాలని కోరుతూ రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టి.జి.భరత్‌కు వివిధ సంస్థల ప్రతినిధులు వినతిపత్రం అందించారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో మంత్రిని ఏపీ చాంబర్స్ పూర్వ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, ఎఫ్ఏపీసీసీఐ అధ్యక్షుడు కంకటాల మల్లిక్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు విజయ్‌మోహన్, హోటల్స్, రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(హెచ్ఆర్ఏఏపీ) అధ్యక్షుడు ఎం.వి. పవన్‌కార్తీక్‌లు కలిశారు. పరిశ్రమలకు అందించే విధానంలో విద్యుత్ చార్జీలు, ప్రాపర్టీ ట్యాక్స్, నీటి సరఫరా చార్జీలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే హోటల్ రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చారని, అదే విధంగా సీఎంతో చర్చించి తగిన రాయితీలు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆహ్లాదానికి చోటేది?



- అభివృద్ధికి నోచుకోని రాజీవ్‌నగర్ పార్కు
- భయపెడుతున్న ముళ్లపొదలు
- పట్టించుకోని అధికారులు పాలకులు

ప్రజలకు ఆహ్లాదం.. ఆనందాన్ని అందించాల్సిన పార్కు కళావిహీనంగా మారింది. కాసేపు సేద తీరాలంటే ఎటు నుంచి ఏపాము.. ఏ పురుగు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి ఉంది. ఫలితంగా లక్షలాది రూపాయలతో నిర్మించిన పార్కు అధ్వానంగా మారింది. అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం వల్లే పార్కుకు ఈ దుస్థితి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. -కూర్మన్నపాలెం

రాజీవ్‌నగర్‌లో నిర్మించిన పార్కు ఆహ్లాదానికి దూరంగా ఉంది. పార్కు విశాలంగా ఉన్నా ఒక గంట కూర్చోవడానికి.. పిల్లా పాపలతో కబుర్లు చెప్పుకోవడానికి వీల్లేకుండా పోతుంది. పార్కు నిండా ముళ్లపొదలు.. తుప్పలు, పుట్టలు విపరీతంగా పెరిగిపోవడంతో అడుగుపెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పార్కుకు వెళ్లాలన్నా... అక్కడ సేదతీరాలన్నా ప్రజలు ఇష్టపడడం లేదు.



పార్కు ముఖచిత్రం

ఇదీ పరిస్థితి

కూర్మన్నపాలెం పరిసర ప్రాంతాల్లో మొట్టమొదటి సారిగా ఏర్పడిన వుడా కాలనీగా రాజీవ్‌నగర్‌కు గుర్తింపు ఉంది. 1987లో రాజీవ్‌నగర్ ఉడా ఫేజ్-1ను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు 80 మంది వరకు ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేశారు. ఆ తర్వాత వారంతా ఇళ్లు నిర్మించుకొని అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వారందరూ సాయంత్రం వేళ కాసింత ఉల్లాసంగా గడపడానికి పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఎకరా స్థలం కేటాయించారు. పార్కును అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. పైగా పార్కు మధ్యలోనే రెండు వాటర్ ట్యాంకులు నిర్మించి అక్కడి నుంచే వాటర్ సరఫరా చేయడం మొదలు పెట్టారు. ఒక ట్యాంకు ద్వారా ఉడా ఫేజ్- 1కు.. మరో ట్యాంకు ద్వారా దువ్వాడ ప్రజలకు మంచి నీరు అందిస్తున్నారు. పార్కు నిర్వహణను గాలికి వదిలేశారు. దీంకి పార్కు నిండా చెట్లు.. పొదలు వీపరీతంగా పెరిగిపోయాయి. దీనివల్ల ఏ పొద నుంచి ఏ పురుగు వస్తుందోనని పార్కు వైపు వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు.



వాకింగ్ ట్రాక్ మధ్యలో పుట్ట



పార్కు మధ్యలో వాటర్ ట్యాంకు

దాతల సాయంతో కుర్చీలు

ఇటీవల కాలంలో కాలనీ సంక్షేమ సంఘ పెద్దలే కలుగజేసుకొని దాతల సహాయంతో కుర్చీలు ఏర్పాటు చేశారు. అంతకు మించి మరే ఆట వస్తువులు లేకపోవడంతో పిల్లలు కూడా పార్కు జోలికి వెళ్లడంలేదు. పార్కును అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను అక్కడ వారు వేడుకున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

విన్నవించినా..



పార్కు అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి విన్నవించాం. కానీ ఎవరు పట్టించుకోవడం లేదు. కనీసం కమ్యూనిటీ సెంటర్ అయినా నిర్మించాలని కోరాం. 11 ఏళ్ల కిందట శిలాఫలకం వేసి వదిలేశారు. అందువల్ల తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. పాలకులు పట్టించుకొని పార్కు అభివృద్ధి చేయాలి.

-మాటూరి శ్రీనివాసరావు, అధ్యక్షుడు,వుడా కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్

దాతల సాయంతో వసతులు



పార్కు విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మాకు మేమే ముందుకు వచ్చి అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. దాతల సహాయంతో ఇప్పటికే ఒక షెడ్డు నిర్మించాం. కొన్ని కుర్చీలు కూడా అందుబాటులోకి తీసుకువచ్చాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిల్లలు ఆడుకొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలి.

- పి. రసూల్‌ఖాన్, వుడా కాలనీ నివాసి

మా ప్రాంతంపై నిర్లక్ష్యం



రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతున్నాయి. దశాబ్దాలు గడుస్తున్నా పార్కును మాత్రం ఎవరు పట్టించుకోవడం లేదు. అందువల్లే ప్రజలు ఎవరు రావడం లేదు. పార్కులో అన్ని ఏర్పాట్లు చేస్తే కొంతసేపు అక్కడ కూర్చోని సేద తీరడానికి. అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేసి వసతులు కల్పించాలి.

- పి. విజయ, రాసాలమ్మకాలనీ వాసి

కిశోరి వికాసం శిబిరాల ముగింపు



ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో నీలవేణి తదితరులు



రెడ్డి ముసలినాయుడుపాలెంలో ర్యాలీ

పెదగంట్యాడ: మండల పరిధిలో నిర్వహించిన కిశోరి వికాసం వేసవి శిక్షణ శిబిరాలు ముగిశాయి. ఈ సందర్భంగా ప్రియదర్శిని కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ పెందుర్తి జోన్ సీడీపీవో నీలవేణి మాట్లాడుతూ కిశోరి బాలికలకు సామాజిక అంశాలతో,విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడల పట్ల అవగాహన పెంచడానికి శిబిరాలు నిర్వహించామన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటి నివారణ గురించి కిశోరి బాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం మానంహారంగా ఏర్పడి ర్యాలీ నిర్వహించారు. బాలికలతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, టీచర్లు కృష్ణవేణి, సావిత్రి, పైడిరత్నం, దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో ఇస్లాంపేట సెక్టార్‌లో రెడ్డిముసలినాయుడు పాలెం, దుర్గవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో నీలవేణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కిశోరి బాలికలకు, తల్లిదండ్రులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రిలో వైద్యుల కొరత!

- రేడియాలజీ, అనస్థిషియా వైద్యులు నిల్
- రేపటి నుంచి నిలిచిపోనున్న కంటి వైద్య సేవలు



ఉక్కు జనరల్ ఆస్పత్రి

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి పరిస్థితి రోజు రోజుకూ తీసికట్టుగా మారుతోంది. ఒకవైపు పర్మనెంట్ వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తుండగా... మరోవైపు కన్సల్టెంట్ స్పెషలిస్టులను కూడా అందుబాటులో ఉంచలేడం లేదు. ప్రస్తుతం కొన్ని విభాగాల్లో ఒకరిద్దరు పర్మినెంట్ వైద్యులు ఉండడంతో అరకొరగా నడుస్తోంది. కంటి విభాగం సేవలు గురువారం నుంచి పూర్తిగా నిలిచి పోయే పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రిలో ఇప్పటి వరకు జనరల్ సర్జన్లు ఇద్దరు పర్మనెంట్ వైద్యులు ఉండగా ఒకరు ఈనెలాఖరున పదవీ విరమణ చేస్తున్నారు. జనరల్ మెడిసిన్‌లో ఒక పర్మనెంట్ స్పెషలిస్టు ఉండగా మరొక కన్సల్టెంట్ స్పెషలిస్టు ఉండేవారు. డెర్మటాలజీ విభాగంలో ఒక పర్మనెంట్ వైద్యుడు, ఒక కన్సల్టెంట్ వైద్యుడు ఉండేవారు. అనస్థీషియా, రేడియాలజీ, కంటి విభాగాల్లో రెగ్యులర్ వైద్యులు లేరు. దీంతో ఇప్పటి వరకు కన్సల్టెంట్లతోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కన్సల్టెంట్ల కాల పరిమితి పూర్తి కావడంతో రేడియాలజీ, అనస్థీసియా, కంటి విభాగాల సవేలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. సర్వేంద్రియాం నయనం ప్రధానం అనే నానుడి మేరకు కంటి విభాగం అత్యంత కీలకం అని అందరికీ తెలిసిందే. ఇప్పటి వరకు కంటి స్పెషలిస్టు సేవలు అందించిన డాక్టర్ రాధాలక్ష్మి, డాక్టర్ ఆనందరావుల సేవలు ఈనెల 4తో నిలిచి పోయాయి. ఆఖరి స్పెషలిస్టు డాక్టర్ సుప్రజ సేవలు బుధవారంతో నిలిచిపోనున్నాయి. దీంతో గురువారం నుంచి నేత్ర రోగులకు ఇబ్బందులు తప్పవు. అప్రమత్తత ఏది?

ప్లాంట్‌లో జరిగే ప్రమాదంలో, ఇంట్లో గాయపడిన ఉద్యోగులు, వారి కుటుంబీకులకు ఏదైనా నేత్రపరమైన సమస్యలు వస్తే వారి పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఆస్పత్రి కన్సలెంట్ల నియామకానికి సంబంధించి ఈనెల 7న నోటిఫికేషన్ జారీ చేయగా 17న ఆఖరి తేదీగా నిర్ణయించారు. వారికి ఈనెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. జూలై 1 నుంచి వారి సేవలు ప్రారంభించే అవకాశం ఉంది. నేత్ర విభాగం వంటి అత్యవసర సేవలు అంశంపై యాజమాన్యం ముందుగానే తగిన చర్యలు తీసుకుని ఉంటే సేవలకు అంతరాయం కలిగి ఉండేది కాదని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. పర్మనెంట్ వైద్యుల నియామకంతో పాటు అత్యవసరంగా కన్సల్టెంట్ స్పెషలిస్టుల నియమాకాన్ని కూడా పూర్తి చేసి వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధానకార్యదర్శి ఎస్. రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు.

దువ్వాడలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని వినతి



ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందిస్తున్న రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లకు ఐదు నిమషాల హాల్ట్ ఇచ్చేలా కృషి చేయాలని ఎంపీ శ్రీభరత్‌ను దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రంలో కోరారు. వందే భారత్‌కు హాల్ట్ ఇవ్వాలని, కోచ్ మెయింటెనెన్స్, నీటిని నింపే పాయింట్ ఏర్పాటు చేయాలని, ఎన్టీపీసీ నుంచి అగనంపూడి, దువ్వాడ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, సబ్బవరం నుంచి దువ్వాడ, ఎస్టీబీఎల్ షీలానగర్ మీదుగా విశాఖ సిటీ బస్టేషన్‌కు సిటీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వి.జాషువా, ఎం.ఎస్.ఎన్.మూర్తి, బి. కామేశ్వరరావు పాల్గొన్నారు.

అభినందనలు

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో సాధారణ ప్రయాణికులకు 38 రోజులుగా మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు చలసాని గాంధీ అభినందించారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామి పచ్చ కర్పూరంతో ప్రత్యేక అలకంరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మలేరియాను శాశ్వతంగా నిర్మూలిద్దాం

వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్

పెదగంట్యాడ: దోమకాటు వల్ల సంభవించే మలేరియాను సమూలంగా నిర్మూలిద్దామని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా పిలుపునిచ్చారు. మలేరియా నివారణ వారోత్సవాల సందర్భంగా వైద్యారోగ్యశాఖ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని, ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు వల్ల మలేరియా వ్యాధి సంభవిస్తుందన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం. శ్రీనివాసరావు, బి. అన్నపూర్ణ, బి. గోపాలం, ఎస్ సునీత, ఎస్. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ సవరణ బిల్లుతో కార్మికవర్గానికి నష్టం



సమావేశంలో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించడానికే ఏపీ ఫ్యాక్టరీల సవరణ బిల్లు 2025ను తీసుకొస్తోందని బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు ఆరోపించారు. గాజువాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సవరణ బిల్లు వల్ల కార్మికుల రోజువారీ పని గంటలను తొమ్మిది నుంచి పది గంటలకు పెంచుతారని, విశ్రాంతి విరామానికి ముందు పని సమయాన్ని ఐదు నుంచి ఆరు గంటలకు పెంచుతారన్నారు. విశ్రాంతితో సహా రోజువారీ పని గంటలను పదిన్నర గంటల నుంచి 12 గంటలకు పెంచుతారని, ప్రతి మూడు నెలల్లో ఓవర్ టైమ్ (ఓటీ) పరిమితిని 50 గంటల నుంచి 144 గంటలకు పెంచుతారని, మహిళా కార్మికులు సేఫ్ గార్డులతో రాత్రి షిఫ్ట్‌లలో పని చేయడానికి అనుమతిస్తారని పేర్కొన్నారు. వ్యాపారం చేయడంలో సౌలభ్యం కోసం, రాష్ట్రంలో వ్యాపారం చేయడానికి మెరుగైన వ్యాపార వాతావరణాన్ని సృష్టించడానికి పెట్టుబడిదారులను ఆకర్షించడానికి ఈ మార్పులు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడం దారుణమన్నారు. దీని వల్ల ఉద్యోగుల శ్రేయస్సు, ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఉద్యోగుల భవిష్యత్‌పై కూడా దుష్ప్రభావం చూపుతాయన్నారు. ఉద్యోగుల సంక్షేమంలో ఫ్యాక్టరీల చట్టం 2025లో చేసిన మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు అనుమతించిన నెట్‌వర్కింగ్ సూత్రాలను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఓటీ పెంపు కొత్త ఉపాధి అవసరాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని, భవిష్యత్తరం ఉద్యోగ అవకాశాలకు అతిపెద్ద అడ్డంకిగా ఉంటుందని అన్నారు. సమావేశంలో బీఎంఎస్ నాయకులు ఎం.వి.ఎస్.నాయుడు, కె.లోవరెడ్డి, లాలం ప్రసాద్, రొక్కం సురేష్ కుమార్, ఒ.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అనే పదాన్ని తొలగిస్తేనే సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న గొలగాని అప్పారావు

అగనంపూడి: జీవీఎంసీలో ఇంజనీరింగ్, పారిశుధ్యం, నీటి సరఫరా విభాగాల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఆప్కాస్ ఉద్యోగుల జాబితా నుంచి తొలగిస్తే తప్పా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులు కారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు అన్నారు. 85వ వార్డు కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవీఎంసీలో వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన జీతాలు కాకుండా పాత జీతాలు ఆయా సెక్షన్ల పరిధిలో ఉండడం వల్ల ఈనెల జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. అలాగే ఈనెల 19న నిర్వహించనున్న యూనియన్ గాజువాక జోన్ మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'సర్వహిత' పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు 15 ఏళ్లుగా పింఛన్లు అందిస్తున్నామని ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు అన్నారు. అగనంపూడి, లంకెలపాలెం, కూర్మన్నపాలెం, దువ్వాడ పరిసర ప్రాంతాల్లోని నిరుపేద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు 60 మందికి పింఛన్లు అందించే కార్యక్రమం మంగళవారం అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడక ట్రస్ట్ కార్యాలయంలో పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా దాతల సహకారంతో కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కిడిమి హనుమంతురావు, జామి గణేష్, శీరంశెట్టి గోవిందరావు, ఎం.ఉమామహేశ్వరరావు, పూడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.


సేవాతత్పరుడు రమేష్



నిమ్మకూరి రమేష్‌ను సత్కరిస్తున్న కాలనీ అభివృద్ధి సంఘ ప్రతినిధులు

అగనంపూడి: నిరుపేదల కష్టాల్లో పాలుపంచుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న నిమ్మకూరి రమేష్ సేవలు నిరుపమానమని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అమ్మి మురళీధర్‌రెడ్డి అన్నారు. మూడున్నర దశాబ్దాలపాటు ఉక్కులోని ఫెర్రోస్క్రాప్ విభాగంలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన నిమ్మకూరి రమేష్‌ను మంగళవారం కాలనీసంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడంలో ముందు వరుసలో ఉండే రమేష్ సేవలను ప్రస్తుతించారు. నగరంలోని అంబేద్కర్ భవన్ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారన్నారు. గ్రీన్‌లాండ్స్ అసోసియేషన్ ప్రతినిధి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జునరావు, ప్రతినిధులు శీల వెంకటరావు, బాలాజీ, శ్రీనివాస్, హనోష్, ఉక్కురాజు, హుస్సేన్ తదితరులు ఘనంగా సత్కరించారు.

సీఐఎస్ఎఫ్ సిబ్బంది జీతాల నిర్వహణపై ఎస్‌బీఐతో ఒప్పందం



ఉక్కునగరం: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బంది జీతాల ఖాతాలను నిర్వహించేందుకు సీఐఎస్ఎఫ్‌తో ఎస్‌బీఐ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, పదవీ విరమణ పొందిన సిబ్బంది ఖాతాలను మూడేళ్ల పాటు నిర్వహించేలా ఒప్పందం జరిగింది. ఈ మేరకు సీఐఎస్ఎఫ్ తరపున అడ్మినిస్ట్రేషన్ డీఐజీ రేఖ నంబియార్, ఎస్‌బీఐ కార్పొరేట్ సెంటర్ జీఎం రంజన్ సిన్హాలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం సిబ్బందికి మెరుగైన ఆర్థిక ప్రయోజనాలను సమకూర్చడంతో పాటు సీఐఎస్ఎఫ్ సిబ్బంది కుటుంబ సభ్యుల సంక్షేమం, ఆర్థిక భద్రతకు దోహదపడతాయని స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ వర్గాలు తెలిపారు. ఒప్పందం నియమాల ప్రకారం జీరో అక్కౌంట్ ఇవ్వడంతో పాటు రూ. 50 లక్షలు ప్రమాద బీమా (మరణ) కవరేజి ఉంటుంది. వార్షిక నిర్వహణ చార్జీలు లేకుండా ఉచిత డెబిట్ కార్డు, ఎస్‌బీఐ ఏటీఎంలలో అపరమిత ఉచిత లావాదేవీలు, ఇతర బ్యాంక్ ఏటీఎంలలో నెలకు 10 ఉచిత లావాదేవీలు, హర్షక లాకర్‌పై 10 శాతం రాయితీ ఉంటాయి. ఉచిత డిమాండ్ డ్రాఫ్టల జారీ ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా జవాన్లకు ఎస్‌బీఐ రిష్తే కుటుంబ పొదుపు ఖాతాను పరిచయం చేశారు. తద్వారా సిబ్బంది భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు, తోబుట్టువులు నాలుగు జీరో ఖాతాలు తెరవడానికి అవకాశం కల్పించారు. ఈ ప్రయోజనాలపై సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ఎస్‌బీఐ సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

యోగా దినోత్సవానికి 25 మంది స్నేక్ క్యాచర్స్



కంబాలకొండ పార్కులో స్నేక్ క్యాచర్స్‌తో రేంజర్ శాస్త్రి

ఆరిలోవ: ఈనెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవానికి 25 మంది స్నేక్ క్యాచర్స్‌ను అటవీశాఖ అధికారులు సిద్ధం చేశారు. వారితో మంగళవారం కంబాలకొండ ఎకో టూరిజం పార్కు క్యాంటీన్‌లో ఫారెస్ట్ రేంజర్ శాస్త్రి సమావేశమయ్యారు. వారి విధులు, ఏయే పాయింట్ల వద్ద ఎవరెవరు ఉండాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా దినోత్సవ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అటవీ శాఖ తరఫున పాములు భయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు బీచ్ రోడ్డులో 28 కిలోమీటర్ల పొడవున ఇరుపక్కలా 85 ప్రాంతాలలో యోగాసనాలు వేస్తారని, ఆ ప్రాంతాలకు సమీపంలో 12 చోట్ల స్నేక్ క్యాచర్స్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వారితో పాటు మరో రెండు మొబైల్ బ్యాచ్‌లు(స్నేక్ క్యాచర్స్) కూడా బైక్‌లపై తిరుగుతాయన్నారు. వారికి ప్రత్యేకంగా ఐడీ కార్డులు అందిస్తామన్నారు. సమావేశంలో సెక్షన్ ఆఫీసరు శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.